నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, మంగళవారం 3 సెప్టెంబర్ 2024 | HYDERABAD


## చిట్టీ డబ్బులు ఇవ్వని శ్రీనిలయ

సిటీబ్యూరో: చిట్టీ డబ్బులు ఇవ్వకుండా ఓ చిట్ ఫండ్ కంపెనీ మోసానికి పాల్పడిందంటూ రిటైర్డు ఉద్యోగి సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు. బోడుప్పల్‌కు చెందిన సత్య నారాయణ రిటైర్డ్ ఉద్యోగి. లక్డీకాపూల్‌లోని శ్రీని లయ చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో తన స్నేహి తుల ద్వారా 40 నెలల కాల పరిమితితో రూ. 20 లక్షల చిట్టీ వేశారు. ఈ ఏడాది జనవరిలో చిట్టీ పాడగా, రూ. 17.2 లక్షలు వచ్చాయి. ఆ డబ్బు లను చిట్‌ఫండ్ మేనేజింగ్ డైరెక్టర్ బసవ శంకర్ రావు అడప, డైరెక్టర్లు రమేశ్ అడప బాబు, రమా దేవి అడప, గీతా రమేశ్ అడప నిర్ణీత సమయంలో ఇవ్వలేదు. దీంతో సంస్థ ఎండీని బాధితుడు నిలదీ యగా, తమకు కూడా రూ. 12 కోట్ల వరకు కస్ట మర్ల ద్వారా వచ్చేవి ఉన్నాయని, అవి వచ్చిన తరు వాత ఇస్తామంటూ చెప్పారు. ఇలా 40 మంది వరకు చిట్టీ డబ్బులు శ్రీనిలయ యాజమాన్యం ఇవ్వాల్సి ఉన్నదని, తమ వద్ద తీసుకున్న చిట్టీ డబ్బులు మళ్లించి ఇతర ఆస్తులు కొనుగోలు చేశా రని బాధితుడు ఆరోపించారు. ఇప్పటికే మూడు శాఖలను మూసేసిన సంస్థ యాజమాన్యం ప్రధాన కార్యాలయాన్ని కూడా మూసేస్తుందంటూ సీసీఎ స్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.




నగరంలో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఏ ఇంట్లో చూసినా.. జ్వరపీడితులే కనిపిస్తున్నారు. రోగులతో ఇలా ఫీవర్ ఆస్పత్రి కిక్కిరిసిపోయింది.

వివరాలు IV పేజీలో

# కేసీఆర్ ముందుచూపు
# తప్పిన ముంపు ముప్పు

**175 కాలనీల్లో వరద గండం తప్పించిన ఎస్ఎన్‌డీపీ**

**4 లక్షల కుటుంబాలకు ముంపు నుంచి శాశ్వత భరోసా**

**లోతట్టు కాలనీల రూపురేఖలు మార్చిన పథకం**

*విజన్ ఉండాలే కానీ ఎంతటి విపత్తునైనా సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన ఎస్ఎన్‌డీపీ ప్రాజెక్టు అక్షరాల నిరూపించింది. గడిచిన మూడు రోజులుగా రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో హైదరాబాద్ మినహా ఖమ్మం, ఇతర పట్టణాల్లో వరద ముంపునకు జనం విలవిలలాడుతున్నారు. నిద్రలేని కాలరాత్రులు గడుపుతున్నారు. కూడు, గూడు లేకుండా జనం అల్లాడిపోతున్నారంటే.. వరద ముంపు ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. అయితే రెండు సెంటీమీటర్ల వర్షానికే అతలాకుతలమయ్యే హైదరాబాద్ మహానగరం..ప్రస్తుతం ఎంతటి వర్షపాతం నమోదైనా తట్టుకుంటున్నది. దీని కారణం ఎస్ఎన్‌డీపీ. ఈ ప్రాజెక్టు పూర్తయిన చోట వరద నీరు సాఫీగా నాలాల ద్వారా మూసీలోకి చేరుతున్నది. నాటి వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు నేడు మహా ఉపశమనం లభించింది. ఒకప్పుడు భారీ వర్షాలు, వరదలు వచ్చిన ప్రతి సందర్భంలోనూ హైదరాబాద్‌లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యేవి. జనజీవనం అస్తవ్యస్తమయ్యేది. 2020 అక్టోబర్ నాటి కుండపోత వర్షాల తర్వాత అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమాన్ని (ఎస్ఎన్‌డీపీ) చేపట్టి.. మహానగర వరద ముంపు కష్టాలను శాశ్వతంగా దూరం చేశారు.*

*-సిటీబ్యూరో, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ )*



2020 అక్టోబర్‌లో కురిసిన భారీ వర్షానికి జలమయమైన కర్మన్‌ఘాట్‌లోని మల్‌రెడ్డి రంగారెడ్డి కాలనీ



ఎస్ఎన్‌డీపీ పనులు తర్వాత ఇలా..

### ఎస్ఎన్‌డీపీ స్వరూపమిది

- ప్రాజెక్టు వ్యయం రూ. 985.45 కోట్లు (జీహెచ్ ఎంసీలో రూ. 747.45కోట్లు, శివారు యూఎల్ బీలలో రూ.238కోట్లు)
- పనులు చేపట్టినవి ( జీహెచ్ఎంసీ పరిధిలో 37, శివారు అర్బన్ లోకల్ బాడీలలో 21 చోట్ల పనులు చేపట్టారు)
- పూర్తి చేసుకున్న పనులు మొత్తం 41- ఇందులో జీహెచ్ఎంసీలో 30, ఇతర మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లలో 11)
- నాలాల అభివృద్ధి పనుల్లో భాగంగా 69.48 కిలోమీటర్లు డ్రైయిన్స్ చేపడితే ఇప్పటి వరకు 42.48 కిలోమీటర్ల మేర పూర్తయ్యాయి.
- ఎస్ఎన్‌డీపీ పూర్తితో లబ్ధి పొందిన కాలనీలు 175, వరద ముంపు నుంచి శాశ్వత భరోసా దక్కిన కుటుంబాలు మొత్తం 4 లక్షల పైమాటే .





సరిగ్గా వందేండ్ల తర్వాత అక్టోబర్ 2020 సంవత్సరంలో కురిసిన కుండపోత వర్షాలతో (20 సెంటీమీటర్లు) గ్రేటర్ జనజీవనం అతలాకుతలమైంది. ఇండ్లు, కాలనీల్లో వరద ముంచెత్తింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు బతుకుజీవుడా అంటూ జీవనం సాగించారు. దాదాపు 40వేల కుటుంబాలు అల్లాడిపోయాయి. ఈ నేపథ్యంలోనే ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా భవిష్యత్‌లోనూ కుండపోత వర్షాలు కురిసినా.. ప్రజలకు వరద నీటి ప్రభావం లేకుండా ఉండేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నది. అప్పటి సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు అప్పటి పురపాలక శాఖ కేటీఆర్ సారథ్యంలో వ్యూహాత్మక నాలా అభివృద్ధి పథకానికి (ఎస్ఎన్‌డీపీ) శ్రీకారం చుట్టారు. ఎస్ఆర్‌డీపీ ఫేజ్-1 కింద రూ.985.45కోట్ల నిధులు మంజూరయ్యాయి. చెరువులు, కుంటలు, తూముల అభివృద్ధి తదితర పనులతో పాటు నాలాల విస్తరణ, ఆధునీకరణ, వర్షపు నీరు వెళ్లేందుకు మార్గాలు లేని చోట్ల కొత్త నిర్మాణాలు, కుచించుకుపోయిన చోట నాలా విస్తరణ, రహదారి కంటే ఎత్తున్న నాలాను సమతుల్యంగా చేయడం, వరద నీటి కాల్వల బలోపేతానికి చర్యలు చేపట్టారు. ఫలితంగా తొలి విడతగా చేపట్టిన ఎస్ఎన్‌డీపీలో భాగంగా 58 చోట్ల చేపట్టిన పనుల్లో 41 ప్రాంతాల్లో పూర్తయ్యాయి. 69.48 కిలోమీటర్ల పనుల్లో 42.48 కిలోమీటర్ల మేర పూర్తి కావడంతో 175 కాలనీలు లబ్ధి పొందాయి. 4 లక్షలకు పైగా కుటుంబాలు వరద ముంపు నుంచి శాశ్వతంగా భరోసా దక్కింది. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క చోటా నాలా పనులను పూర్తి చేయలేదు..పురోగతిలో ఉన్న వాటిని పట్టించుకోలేదు. నేటికీ 17 చోట్ల పనులు నత్తనడకన జరుగుతుండటంతో ఆ ప్రాంతాల్లో వరద కష్టాలు తప్పడం లేదు.రెండు రోజుల కిందట అల్లాపూర్, కూకట్‌పల్లిలో 20 ఇండ్లు నీట మునగడానికి నత్తనడకన సాగుతున్న నాలా పనులే నిదర్శమని అధికారులే పేర్కొనడం గమనార్హం.




## ఎస్ఎన్‌డీపీదే ఘనత

**కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అద్భుతమైన పథకమిది**

**భారీ వర్షాలు కురిసినా.. నగరంలో ముంపు సమస్యే లేదు**

**ఎస్ఎన్‌డీపీలో భాగస్వామ్యమైన వారందరికీ అభినందనలు**

**'ఎక్స్' వేదికగా మాజీ మంత్రి కేటీఆర్**



*'విజన్ ఉంటే విపత్తులను కూడా సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని..కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన ఎస్ఎన్‌డీపీ కార్యక్రమం అక్షరాలా నిరూపించింది' అని మాజీ మంత్రి కేటీఆర్ సోమవారం 'ఎక్స్ ' వేదికగా వెల్లడించారు. రెండు, మూడు రోజులుగా హైదరాబాద్‌లో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నా.. లోతట్టు ప్రాంతాలకు ముంపు లేకుండా కాపాడటంలో 'ఎస్ఎన్‌డీపీ' కీలక పాత్ర పోషించిందని గుర్తు చేశారు. - సిటీబ్యూరో*

సమైక్య రాష్ట్రంలో ఉన్నప్పుడు భారీ వర్షాలు, వరదలు వచ్చిన ప్రతి సందర్భంలోనూ హైదరాబాద్‌లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యేవని, కాలనీల్లోని ఇండ్లలోకి వరద నీరు చేరి జనజీవనం పూర్తిగా అస్తవ్యస్తంగా మారేదని కేటీఆర్ గుర్తు చేశారు. ఈ కీలక సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనాలనే ఆలోచనలో భాగంగానే అద్భుతమైన ఎస్ఎన్‌డీపీ పథకం పురుడు పోసుకుందన్నారు. రాష్ట్ర రాజధానిలో వరద నీరు, మురుగునీటి వ్యవస్థను పూర్తి స్థాయిలో పటిష్ట పరిచేందుకు రూ.985 కోట్లతో 60 పనులు చేపట్టడంతో నేడు వరద ముప్పు తప్పిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక్క పైసా సహకారం లేకున్నా.. మొత్తం రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఎస్ఎన్‌డీపీ పనులు చేపట్టడం మరో ప్రత్యేకత అని కేటీఆర్ వెల్లడించారు. చిన్నపాటి వర్షానికే పొంగిపొర్లే 36 కీలకమైన నాలాల అభివృద్ధి పనులను శరవేగంగా చేపట్టామన్నారు. తాజాగా రాజధానిలో ఇంత భారీగా వర్షం కురిసినప్పటికీ గతంలో ముంపునకు గురైన ప్రాంతాల్లో వరద నీరు నిల్వకపోవడం ఎస్ఎన్‌డీపీ ఘనతేనన్నారు. ఇదే విషయాన్ని ఆయా ప్రాంతాల్లోని ప్రజలే హర్షం వ్యక్తం చేస్తూ చెబుతుండటం గొప్ప సంతృప్తినిస్తున్నదన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎన్‌డీపీ పనుల్లో భాగస్వామ్యమైన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు.



### ఫీడర్ సర్వీసుల ద్వారా.. 50 లక్షల మంది ప్రయాణం

**మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి**

సిటీబ్యూరో, సెప్టెంబర్ 2(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మెట్రో రైలు కారిడార్లలో ఏర్పాటు చేసిన ఫీడర్ సర్వీసుల ద్వారా ఇప్పటి వరకు 50 లక్షల మంది ప్రయాణించినట్లు మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. సోమవారం నగరంలో జరిగిన కార్యక్రమంలో మెట్రో షటిల్ సర్వీసులను నిర్వహిస్తున్న స్వీదా సంస్థ నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ 15 మెట్రోస్టేషన్ల నుంచి 64 మార్గాల్లో స్వీదా సంస్థ ఫీడర్ సర్వీసులను నడుపుతున్నదని, ప్రతి రోజూ 16వేల మంది ప్రయాణం చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎల్ అండ్ టీ మెట్రో సీఎండీ కేవీబీ రెడ్డి, స్వీదా మొబిలిటీ సీఈవో సిద్ధార్థ్ రవి, కో ఫౌండర్ జిగ్నేశ్ పి.బెలానీ, మెట్రో రైలు అధికారులు పాల్గొన్నారు.

### ఉచితంగా మట్టి గణపతుల పంపిణీ

సిటీబ్యూరో: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా లక్ష మట్టి గణపతులను పంపిణీ చేసేందుకు హెచ్ఎండీఏ సన్నాహాలు చేసింది. మరిన్ని వివరాలకు ఈఈ శంకర్ (9849909845), డిప్యూటీ ఈఈ విక్రమ్ (9849031531) సంప్రదించాలని అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### స్థానచలనం..

సిటీబ్యూరో : జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగంలో భారీగా బదిలీలు జరిగాయి. ఈ మేరకు ఎస్ఈ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ , డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఏఈఈలకు స్థానచలనం కల్పిస్తూ జీహెచ్ఎంసీ ఈఎన్సీ జియావుద్దీన్ ఉత్తర్వులు జారీ చేశారు. 12 మంది ఎస్ఈ, ఈఈలతో పాటు 16 మంది డిప్యూటీ ఈఈలు, 37 ఏఈఈల బదిలీలు జరిగాయి.

# నానుతున్న నగరం

**సహాయక చర్యల్లో జాప్యం..**

**అధ్వానంగా పారిశుధ్య నిర్వహణ**

**కంపుకొడుతున్న రహదారులు**

**ధ్వంసమైన విద్యుత్ స్తంభాలు..**

**సరఫరాకు అంతరాయం**

సిటీబ్యూరో/మేడ్చల్: గ్రేటర్‌లో వాన కష్టాలు కొనసాగుతున్నాయి. మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 185 చెరువులకు 32 ఉప్పొంగి నాలాల్లోకి వరద పోటెత్తుతుండటంతో సమీప ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రేటర్ వ్యాప్తంగా 51 చోట్ల చెట్లు విరిగిపడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. డీఆర్ఎఫ్ బృందాల సహాయక చర్యలు ఆలస్యం కావడంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆలస్యంగా స్పందించి 47 చోట్ల ఫిర్యాదులను పరిష్కరించారు. పలు చోట్ల వర్షాలతో మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లాయి. మురుగు నీరు రహదారులపై ఏరులై పారింది. బల్దియా సిబ్బంది అలసత్వంతో ప్రజలు అవస్థలుపడుతున్నారు. ఇక మాదాపూర్‌లో గౌతమి ఎన్‌క్లేవ్, అంజనా హైట్స్ చెంత తవ్వి ఉంచిన సెల్లార్ ప్రహరీ గోడ కూలింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాప్రాయం తప్పింది. కాగా, హుస్సేన్ సాగర్‌కు 2811 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా..దిగువ మూసీలోకి 2255 క్యూసెక్కులను వదులుతున్నట్లు అధికారులు తెలిపారు. మరోవైపు జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం క్షేత్రస్థాయిలో రెండు రోజులుగా పర్యటించింది. జీహెచ్ఎంసీ పరిధిలో 597 శిథిల భవనాలు ఉండగా, 354 చోట్ల చర్యలు తీసుకున్నది. 107 చోట్ల సంబంధిత భవనాలను కూల్చివేయగా, 109 వాటికి మరమ్మతులు జరిపారు. 135 చోట్ల ఇతర ప్రాంతాలకు బాధితులను తరలించారు. మూడు భవనాలను సీజ్ చేశారు. ఇక సెల్లార్ నిర్మాణాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. 181 ప్రాంతాలను గుర్తించి 140 చోట్ల చర్యలు తీసుకున్నారు. 41ప్రాంతాల్లో పనులు జరగకుండా నిలిపివేయించారు. వర్షాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ కంట్రోల్ రూంకు ఫిర్యాదులు పోటెత్తాయి. ఆదివారం తెల్లవారు జాము నుంచి అర్ధరాత్రి వరకు వివిధ సమస్యలపై 150కి పైగా ఫిర్యాదులొచ్చాయి.

**చెరువులు కళకళ ..**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లావ్యాప్తంగా చెరువులు నిండుకుండాలా మారాయి. కొన్ని చెరువులు నిండి మత్తడి పారుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి ఏడాది మిషన్ కాకతీయ ద్వారా చెరువుల అభివృద్ధి చేపట్టడం వల్ల చెరువు కట్టలు బలంగా మారి.. పూర్తిస్థాయిలో నిండినా..ఇబ్బందులు లేకుండా ఉన్నాయి. జిల్లాలోని చెరువుల అభివృద్ధి, మరమ్మతులకు ఇప్పటి వరకు రూ. 40 కోట్ల నిధులను వెచ్చించారు. ఇదిలా ఉంటే రెండు రోజులుగా పడుతున్న వర్షాలతో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయలు ఏర్పడుతుండటంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అనేక ప్రాంతాల్లో రాత్రి నుంచి ఉదయం వరకు విద్యుత్ సరఫరా లేదని ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

**కరెంటు స్తంభాలు దెబ్బతిన్నా..**


వర్షాలకు నగరంలోని పలు చోట్ల చెట్లు నేలకూలి... విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. వాటిని సరిచేసేందుకు విద్యుత్ సిబ్బంది గంటల సమయం తీసుకోవడంపై విమర్శలు వస్తున్నాయి. బంజారాహిల్స్ సర్కిల్ పరిధిలోని మధురానగర్, లక్ష్మీనగర్‌లో కురిసిన భారీ వర్షం,గాలుల ఉధృతికి నాలుగు పెద్ద చెట్లు వేర్లతో సహా విద్యుత్ స్తంభాలపై కూలిపోయాయి. దీంతో సుమారు 8 స్తంభాలు వంగిపోగా, మరికొన్ని విరిగిపోయాయి. దీంతో వాటికి ఉన్న కేబుళ్లు, విద్యుత్ తీగలు చెట్ల కొమ్మల్లో చిక్కుకొని ధ్వంసమయ్యాయి. అయితే చెట్లు కూలిన చోట వాటి కొమ్మలు కొట్టి తొలగించేందుకు చాలా సమయం పట్టిందని, సాధ్యమైనంత త్వరగా విద్యుత్ సరఫరా అందించాలనే ఉద్దేశంతో హుటాహుటిన ఏబీ కేబుల్స్ సమకూర్చుకొని, కూలిన చెట్ల కింద నుంచి ఏబీ కేబుల్స్‌తో కొత్త లైన్స్ వేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని తెలిపారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్ బీ బ్లాక్‌లో విద్యుత్ స్తంభాలు విరిగిపోయి గంటల తరబడి నిలిచిపోయిందని, సరఫరాను పునరుద్ధరించడంలో తీవ్ర జాప్యం చోటు చేసుకుందని స్థానికులు వాపోయారు. అలాగే మధురానగర్ డీ బ్లాక్‌లో 28 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. భారీ వర్షాలకు చెట్లు నేల కూలడంతో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు నిలిచిపోయిన సరఫరా సోమవారం రాత్రి 7.30 గంటల ప్రాంతంలో పునరుద్ధరించారు.

**జంట జలాశయాలకు..**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జంట జలాశయాలైన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లోకి వరద నీటి ప్రవాహం కొనసాగుతున్నది. ఉస్మాన్‌సాగర్‌లోకి 3వేలు, హిమాయత్‌సాగర్‌లోకి 1500 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నదని జలమండలి అధికారులు తెలిపారు. ఉస్మాన్‌సాగర్ గరిష్ఠ స్థాయి నీటి మట్టం 1790 అడుగులు కాగా..1785.10 అడుగులకు నీటి నిల్వలు ఉన్నాయి. హిమాయత్‌సాగర్ గరిష్ఠ స్థాయి నీటి మట్టం 1763.50 అడుగులు ఉంటే.. 1759.50 అడుగులకు నీటి నిల్వ ఉంది. ఉస్మాన్‌సాగర్‌ను జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్ సోమవారం సందర్శించారు. ఆయన వెంట రంగారెడ్డి కలెక్టర్ శశాంక తదితరులు ఉన్నారు.

**నాణ్యతా ప్రమాణాలు పాటించాలి**

తాగునీటి సరఫరాలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ జలమండలి అధికారులకు సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో సోమవారం సాయంత్రం మాసబ్‌ట్యాంక్‌లోని టీయూఎఫ్ ఐడీసీ కార్యాలయంలో జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ ఇతర ఉన్నతాధికారులతో తాగునీటి సరఫరాపై సమావేశాన్ని నిర్వహించారు.



### వర్షసూచన

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో గ్రేటర్ వ్యాప్తంగా ముసురు వాన కురుస్తున్నది. శని, ఆదివారాల్లో దంచికొట్టిన వాన.. సోమవారం నాటికి కొంత తగ్గుముఖం పట్టినప్పటికీ ముసురు మాత్రం వదలడం లేదు. సోమవారం రాత్రి 9గంటల వరకు నగరంలోని నాగోల్‌లో అత్యధికంగా 1.33సెం.మీల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఇప్పటికే తీరం దాటిన వాయుగుండం రాగల 12 గంటల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉందని, దీని ప్రభావంతో రాగల మరో మూడు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో నగరానికి ఎల్లో అలర్ట్ హెచ్చరికలు జారీ చేశారు.



చెంగిచర్ల ప్రధాన రహదారిపై పేరుకుపోయిన వ్యర్థాలు



వర్షాలకు గుంతలమయమైన ఉప్పల్ ప్రధాన రహదారి